బషీర్‌బాగ్ పీజీ లా కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 17: ఓయూ పరిధిలోని బషీర్‌బాగ్ పీజీ లా కళాశాలలో ఐదేళ్ల లా సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న సీట్లను ఈనెల 19న నిర్వహించబోయే స్పాట్ అడ్మిషన్లలో భర్తీ చేయనున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 19న ఉదయం 10 గంటలలోపు కళాశాలలో తమ దరఖాస్తులు అందజేయాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రవేశాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీఈడీ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 17: ఓయూ పరిధిలోని బీఈడీ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు మెమోలను మూడువారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈ నెల 26వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరు వారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 29వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

నేటి మేకిన్ ఇండియా స్ఫూర్తి సూరి

అవార్డులు అందజేస్తున్న గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, చిత్రంలో డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి

- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ సతీశ్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 17: ప్రస్తుతం దేశంలో అమలు చేస్తున్న మేకిన్ ఇండియా కార్యక్రమానికి స్ఫూర్తి ప్రదాత డాక్టర్ సూరి భగవంతం అని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ సతీశ్‌రెడ్డి అన్నారు. భగవంతం ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవాన్ని ఓయూలోని పీజీఆర్ఆర్‌సీడీఈ ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. ఆయన 115వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇంద్రసేనారెడ్డి, సతీశ్‌రెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ భగవంతం స్ఫూర్తితోనే నేడు దేశం రక్షణ రంగంలో స్వయం సమృద్ధిని సాధించిందని అన్నారు. ఆయన పేరున పోస్టల్ స్టాంప్ తీసుకువస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు రక్షణ రంగ పరికరాల కోసం విదేశాలపై ఆధారపడి ఉండేదన్నారు. నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు డాక్టర్ భగవంతం ప్రేరణతోనే సొంతంగా రక్షణ పరికరాలను తయారు చేసుకోవడం ప్రారంభించిందని చెప్పారు. హైదరాబాద్‌లో డీఆర్‌డీవో, డీఆర్‌డీఎల్ వంటి సంస్థలు, రక్షణ రంగ ల్యాబరేటరీలు ఏర్పాటు కోసం ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. బెంగుళూరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ డైరెక్టర్‌గా ఆయన ఆ సంస్థకే వన్నె తెచ్చారని కీర్తించారు. ఓయూ ప్రొఫెసర్‌గా, వీసీగా పనిచేసిన ఆయన అప్పట్లోనే భౌతికశాస్త్రంలో పరిశోధనలకు శ్రీకారం చుట్టారని అన్నారు. అదే స్ఫూర్తితో వర్సిటీలో పరిశోధనలు కొనసాగుతున్నాయని ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ వి.రాజబాబు, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌చౌహాన్, ఇంటెలిజెంట్ డిజైన్ సీఈవో రవి నిమ్మగడ్డ, రివి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ మోచర్ల శశిభూషణ్ తదితరులకు అవార్డులు అందజేశారు.

వాల్మీకి రచనలు నేటికీ స్ఫూర్తి

వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీజీపీసీబీ సభ్య కార్యదర్శి జి.రవి, తదితరులు

అమీర్‌పేట్, అక్టోబర్ 17: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీజీపీసీబీ సభ్య కార్యదర్శి జి.రవి వాల్మీకి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి రచనల్లో ధర్మం, కర్మ, భక్తి, అహింస, ఆధ్యాత్మిక అంశాలకు ప్రాధాన్యత ఉందని, సన్మార్గంలో నడిచే వారికి ఆయన రచనలు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో టీజీపీసీబీ సోషల్ సైంటిస్ట్ ప్రసన్నకుమార్‌తో పాటు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ కళాశాలలో వాల్మీకి జయంతి

చిక్కడపల్లి, అక్టోబర్ 17: బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ విష్ణుప్రియ హాజరై మాట్లాడారు. వాల్మీకి రచనలు ఎంతో మందికి ఆదర్శమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్, వివిధ విభాగాధిపతులు, భోదన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొనారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

కుట్టుమిషన్ల పంపిణీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

మారేడ్‌పల్లి, అక్టోబర్ 17: బాధిత కుటుంబాలను ఆదుకునే విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు చాలా బాధాకరమని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ విచారం వ్యక్తం చేశారు. గురువారం మోండా మార్కెట్‌లోని ఓల్డ్ జైల్ ఖానా వద్ద నాలుగు మేరు కుటుంబాలకు సంఘం ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు, మరో ఇద్దరు బాధితులకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు తాను వ్యక్తిగతంగా ఒక్కో కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం చేశానని గుర్తుచేశారు. ఘటన జరిగి నెల కావస్తున్నా బాధితులను ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. జీవనోపాధి కోల్పోయిన వారి కోసం త్వరలోనే తాత్కాలిక షెడ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కార్యక్రమంలో మోండా డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు తలసాని స్కైలాబ్‌యాదవ్, నాగులు, రాములు, మహేశ్‌యాదవ్, మహేందర్, మేరు సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్రైస్తవ శ్మశానవాటికల వద్ద ఏర్పాట్లు

ఎమ్మెల్యే తలసానిని కలిసిన క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 17: నవంబర్ 2న జరిగే ఆల్ సోల్స్ డే కోసం క్రైస్తవ శ్మశానవాటికల వద్ద తగిన ఏర్పాట్లను చేస్తామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బోయిగూడలోని క్యాథలిక్ సిమెట్రి నిర్వాహకులు గురువారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. నవంబర్ 2న వేలాదిమంది ప్రజలు శ్మశానవాటికకు వస్తారని, వారికి తగిన వసతులు, సదుపాయాలను కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అన్ని సదుపాయాలు, అనువైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఫాదర్ ఆరోగ్యం, హూజి టార్చర్, జయరాజ్, పియర్స్ డిసిల్వ, సగాయ్‌రాజ్, బన్సీలాల్ పేట్ కార్పొరేటర్ కె.హేమలత, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్‌రాజు, నాయకులు కె.లక్ష్మిపతి పాల్గొన్నారు.

ఎల్వోసీ పత్రాలు అందజేత

ఎల్వోసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, అక్టోబర్ 17: పేదలకు వైద్య సాయం అందించేందుకు సిద్ధంగా ఉంటామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. నియోజకవర్గంలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన స్టాలిన్, వారాసిగూడకు చెందిన బీపాషాకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షల చొప్పున ఎల్వోసీ పత్రాలు మంజూరయ్యాయి. గురువారం సాయంత్రం తన కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శంకర్ ముదిరాజ్

చిక్కడపల్లి, అక్టోబర్ 17: పార్టీకోసం పని చేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడిగా నియమితులైన శంకర్‌ముదిరాజ్ గురువారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసమస్యలు పరిష్కరిండంలో బీఆర్ఎస్ శ్రేణులు ముందుండాలని అన్నారు. కార్యక్రంలో నాయకులు ఎర్రం శేఖర్, ఆర్.జయదేవ్, కల్యాణ్‌నాయక్, శివయాదవ్, ముదిగొండ మురళి, కూరగాయల శ్రీను, టీవీ రాజు పాల్గొన్నారు.

నగర కమిటీలో సీనియర్లకు ప్రాధాన్యత కల్పించాలి



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిసి మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్, అక్టోబర్ 17: బీఆర్ఎస్ నగర కమిటీలో సినీయర్లకు ప్రధాన్యత కల్పించాలని మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పార్టీకోసం కష్టపడి పని చేసేవారికి, సినీయర్లకు తగిన పదవులు ఇచ్చి గౌరవించాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రాముఖ్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిరిగిరి శ్యాం, అజయ్ ముదిరాజ్, కల్వ గోపి, జోగిందర్, ఆటో శ్రీను, సిరిగిరి కిరణ్, రమేశ్, సత్యనారాయణ, బాల్‌రాజ్‌గౌడ్, సదా, వెంకటేశ్, శివ, మధు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నూతన కమిటీ ప్రమాణస్వీకారం

ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

ముషీరాబాద్, అక్టోబర్ 17: సివిల్ సప్లయ్ సర్కిల్-6 రేషన్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశం రాంనగర్ ఎస్ఆర్టీ కమ్యూనిటీ హాల్ జరిగింది. నూతన కార్యవర్గం ఎంపిక, అనంతరం ప్రమాణ స్వీకారం జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా బ్యారం కుమార్, ప్రధాన కార్యదర్శి వాడకట్టు రాజు, కోశాధికారి మోనుజ్జమాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.మహేందర్ రాజు, సలహాదులు సీహెచ్ గౌరయ్య, ఎ.అప్పారావు, న్యాయ సలహాదారులు వనం రమేశ్, ఉపాధ్యక్షులు ఎం.జనార్దన్, కేఆర్కే ప్రసాద్, కె.తిరుపతి, ఎర్రం శ్రీనివాస్, మీడియా కార్యదర్శిగా కె.విజాయానంద్, సంయుక్త కార్యదర్శులుగా శ్రావన్‌కుమార్, ఎన్‌బీ చారి, కార్యనిర్వాహ కార్యదర్శిగా పి.వేణు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాయకోతి రాజు, సంజీవరెడ్డి, జాతీయ అధ్యక్షుడు కాచం కృష్ణమూర్తి, హైదరాబాద్ అధ్యక్షుడు పుస్తె శ్రీకాంత్ హాజరయ్యారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

చిక్కడపల్లి, అక్టోబర్ 17: కవాడిగూడ డివిజన్ తాళ్ల బస్తీలోని సాయిబాబా ఆలయంలో గురువారం సాయిబాబా ఉత్సవాలను నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నగేశ్ ముదిరాజ్ హాజరై పూజలు చేశారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

చిక్కడపల్లి,అక్టోబర్17 చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ సమక్షంలో గురువారం లెక్కించారు. 108 రోజులకుగాను మొత్తం రూ.24,00,348 వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక సభ్యుడు జి.శ్రీనాథ్ గౌడ్, కార్యనిర్వాహణాధికారి ఆంజనేయులు తెలిపారు.

చిలకలగూడ సీఐని కలిసిన నేతలు

సికింద్రాబాద్: చిలకలగూడ సీఐ అనుదీప్‌ను గురువారం పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పార్టీ సికింద్రాబాద్ సీనియర్ నాయకుడు గరికపాటి చంద్రశేఖర్, నాయకులు రవి, నవీన్, మహాత్మ పాల్గొన్నారు.

టీజీ సీపీజీఈటీ రిపోర్టింగ్ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 17: రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన టీజీ సీపీజీఈటీ- 2024 ప్రవేశాలు పొందిన అభ్యర్థులు ఆయా కళాశాలల్లో రిపోర్టింగ్ చేసే గడువును పొడిగించినట్లు టీజీ సీపీజీఈటీ ఇన్‌చార్జి కన్వీనర్ ప్రొఫెసర్ జలపతి తెలిపారు. మొదటి, రెండో దశలో ప్రవేశాలు పొందిన వారు ఆయా కళాశాలల్లో ఈనెల 21లోగా రిపోర్టు చేయాలని సూచించారు. ఇతర వివరాలకు తమ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని అన్నారు.

డిప్యూటీ మేయర్‌కు ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 17: చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో రానున్న దీపావళి సందర్భంగా నిర్వహించే పూజలకు నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిని ఆహ్వానించారు. తార్నాకలోని క్యాంపు కార్యాలయంలో ఆమెకు ఆలయ కమిటీ సభ్యులు శశికళ, చంద్రప్రకాశ్, సంతోష్ ఆహ్వానపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి పాల్గొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కంటోన్మెంట్, అక్టోబర్ 17: కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఓల్డ్ బోయిన్‌పల్లి ఆర్ఆర్‌నగర్‌లో శివరాజ్(33) వాచ్‌మెన్. తన భార్య దీప, పిల్లలతో నివాసముంటున్నాడు. ఇద్దరి మధ్య గొడవతో భార్య ఈనెల 12న తన తల్లితండ్రుల ఇంటికి వెళ్లింది. శివరాజ్ మనస్తాపంతో గదిలో తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అన్నదానం

చిక్కడపల్లి, అక్టోబర్ 17: చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం చిక్కడపల్లిలోని నగర గ్రంథాలయం సమీపంలో అన్నదానం నిర్వహించారు. తమ సంఘం ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాలకుమార్, టి.రవీందర్‌గుప్తా, రవిశంకర్ గుప్తా, ఆర్.బాల్‌చందర్, శ్రీనివాస్, ధనలక్ష్మి తదితరలు పాల్గొన్నారు.

24 గంటల్లోగా ఫీజు బకాయి విడుదల చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 17: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి 24 గంటల్లో విడుదల చేయాలని బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సెక్రెటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించకుండా విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించడమే ధ్యేయంగా సీఎం పనిచేస్తున్నాడని దుయ్యబట్టారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయి రూ.7,600 కోట్లు ఉన్నాయని చెప్పారు. ఏడాదిగా గురుకులాలకు ఫుడ్ ప్రొవిజన్ బిల్లులు చెల్లించకపోవడంతో తాళాలు వేసే పరిస్థితి ఎదురైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు చేరాల వంశీ, దాడి అజయ్, కిరణ్‌యాదవ్, కీర్తి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలను భ్రష్టు పట్టిస్తున్న ప్రభుత్వం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 17: రాష్ట్రంలో గురుకులాలను కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తోందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు అన్నారు. అప్పటి సీఎం కేసీఆర్ దూరదృష్టితో ఆలోచించి, 1022 గురుకులాలను ఏర్పాటు చేసి, నాణ్యమైన విద్యను అందించారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అద్దె భవనాలకు డబ్బులు చెల్లించకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి విడుదల చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పీజీ కళాశాలలు మూసివేయడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. పేద విద్యార్థులను చదువుకు దూరం చేసే కుట్ర చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేడని, సీఎం విద్యారంగ సమస్యలను తెలుసుకునే తీరిక లేదా అని ప్రశ్నించారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

టీసీ ఇవ్వకుంటే పీజీ అడ్మిషన్ రద్దు సిగ్గుచేటు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవన్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 17: ఓయూ పరిధిలోని పీజీ ప్రవేశ ప్రక్రియలో ఒరిజినల్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ) ఇవ్వకుంటే అడ్మిషన్ రద్దు చేయనున్నట్టు టీజీ సీపీజీఈటీ ఇన్‌చార్జి కన్వీనర్ ప్రొఫెసర్ జలపతి చెప్పడం సిగ్గుచేటని ఏబీవీపీ తెలంగాణ వర్సిటీస్ కన్వీనర్ జీవన్ మండిపడ్డారు. అధికారుల వైఖరితో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాధారణంగా టీజీ సీపీజీఈటీ అన్ని విడతల కౌన్సిలింగ్ పూర్తి అయిన తరువాత నెలరోజుల వరకు టీసీ సబ్మిషన్ చేసేందుకు అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలు ఫీజు కడితేనే టీసీ ఇస్తామని షరతులు విధిస్తున్నాయని అన్నారు. దీంతో విద్యార్థులు సకాలంలో టీసీలు సబ్మిట్ చేయలేకపోతున్నారని చెప్పారు. వీటిని దృష్టిలో ఉంచుకుని అధికారులు దీనిపై పునరాలోచన చేయాలని కోరారు.

తనకు సరైన న్యాయం చేయాలి

చిక్కడపల్లి, అక్టోబర్ 17: గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోను చర్చి ట్రస్టు సభ్యులు తనపై 34 కేసులు ఉన్నాయని తప్పుడు ప్రచారం చేశారని చర్చి సొసైటీ అధికార ప్రతినిధి రాగి వీరాచారి అన్నారు. గురువారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరాచారి మాట్లాడారు. హైకోర్టు న్యాయమైన తీర్పు ఇచ్చిందని తెలిపారు. ట్రస్టు వారు పెట్టిన 4కేసులు మాత్రమే ఉన్నట్టు పరిశీలించిన హైకోర్టు బుధవారం తనను అరెస్టు చేయరాదని, స్టే ఇచ్చిందన్నారు. ఆగస్టు 31న రాత్రి ట్రస్టుకు సంబంధించిన కొంత మంది హెబ్రోను చర్చిపై దాడి చేశారని చెప్పారు. ఆ సందర్భంలో తనపై అక్రమంగా హత్యాయత్నం కేసు పెట్టారని వాపోయారు. ప్రభుత్వం, పోలీసులు తమకు తగిన విధంగా న్యాయం చేయాలని కోరారు.

ద్విచక్ర వాహనానికి మంటలు

చిక్కడపల్లి, అక్టోబర్ 17: లోయర్ ట్యాంక్‌బండ్ రామకృష్ణ మఠం వద్ద ఓ ద్విచక్రవాహనం మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన దోమలగూడ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. విద్యానగర్‌కు చెందిన వెంకట మహేశ్ తన పల్సర్‌పై ఉద్యోగానికి వెలుతున్న క్రమంలో రామకృష్ణ మఠం వద్దకు రాగానే వాహనం నుంచి మంటలు వచ్చాయి. గమనించి పక్కకు నిలిపివేశాడు. దీంతో మంటల్లో వాహనం పూర్తిగా దగ్ధమయ్యింది.

కుమ్రంభీం ఆశయాలను కొనసాగించాలి

సికింద్రాబాద్, అక్టోబర్ 17: కుమ్రంభీం ఆశయాలను కొనసాగించాలని ఆదివాసి తోటి సేవా సంఘం నేతలు అన్నారు. ఆయన వర్ధంతిని గురువారం నిర్వహించారు. సీతాఫల్‌మండి పాండవబస్తీలో ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసి తోటి సేవా సంఘం అధ్యక్షుడు ఎం.ఆనంద్, ఉపాధ్యక్షుడు ఎం.వినోద్, కన్వీనర్ ఎస్.గోవర్ధన్, ట్రెజరర్ కె.నర్సింహా, వర్కింగ్ ప్రెసిడెంట్లు ఎం.సంపత్, ఎం.నటరాజ్ పాల్గొన్నారు.

చిక్కడపల్లి: ట్యాంక్ బండ్‌పై కోమరం భీం వర్ధంతి నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ సర్వేశ్వర్‌రెడ్డి, తెలుగు సినీ నిర్మాత అల్లాణి శ్రీధర్, గిరిజన ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ నాగు, వర్కింగ్ ప్రెసిడెంట్, వివేక్‌నాయక్, అధ్యక్షుడు అర్జున్, కిషన్, సోయం ప్రభాకర్ నివాళులర్పించారు.

క్రీడాకారులకు అండగా ఉంటా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌తో క్రీడాకారిణి వైష్ణవి

బేగంపేట్, అక్టోబర్ 17: క్రీడాకారులకు అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో ఇంటర్నేషనల్ కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన మహేశ్ వైష్ణవి ఎమ్మెల్యేను కలిశారు. ఈ సంధర్భంగా వైష్ణవిని ఎమ్మెల్యే అభినందించారు. ఖర్చుల నిమిత్తం తలసాని ట్రస్ట్ ద్వారా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు.

శాంతి చండీ హోమం

మారేడ్‌పల్లి, అక్టోబర్ 17: సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంలో గురువారం శాంతి చండీ హోమం, పూర్ణాహుతి జరిగింది. జోగిని శ్యామల, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ, బజరంగ్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాం హాజరయ్యారు. మూడు రోజులుగా ఆలయ వద్ద నిరసన చేస్తున్న బస్తీవాసులకు పోలీసులకు గురువారం స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. కార్పొరేటర్ కొంతం దీపిక, బస్తీ మహిళలు టెంట్‌ను వేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వాగ్వాదం జరిగింది. డీసీపీ స్పందించి సమస్యను పరిష్కరించారు.

అఘోరా పూజలు

మారేడ్‌పల్లి: సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో గురువారం అఘోర పూజలు నిర్వహించారు. ఆలయం లోపల ఒంటికాలిపై నిలబడి పూజలు చేశారు.

ఆలయంలో ఒంటికాలిపై నిలబడి పూజలు చేస్తున్న అఘోరా